క్లుప్తంగా

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..

కస్టమ్స్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



పాత గుంటూరు: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాత గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో యాదవ హైస్కూలు 1988–89 బ్యాచ్ విదార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. సివిల్స్ పరీక్షలలో విజయం సాధించే అవకాశాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలతో జరిగే ప్రమాదం, డ్రగ్ వినియోగానికి విద్యార్థులు ఎలా దూరంగా ఉండాలో తెలియజేశారు. మాదక ద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించడానికి కస్టమ్ నషాముక్త భారత్ ప్రచారం ద్వారా అనేక చర్యలు చేపడుతుందని నరసింహారెడ్డి తెలిపారు. కమిషనర్ నరసింహారెడ్డిని ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. జీఎస్టీ అధికారులు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, నవీన్, ఈశ్వరరావు, కాకర్ల శ్రీను, పాల్గొన్నారు.

అక్మే స్కూల్లో వార్షిక క్రీడోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు శివారు పొత్తూరులోని అక్మే స్కూల్లో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా వార్షిక క్రీడా పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా పుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, రన్నింగ్ పోటీలను నిర్వహించి, విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో పాటు స్కూల్ ఛాంపియన్‌షిప్, వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ గెలుపొందారు. పాఠశాల డైరెక్టర్లు సౌగంధ్ కృష్ణ, దీప్తి నందమూరి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసాన్ని కలుగచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా మంగళవారం సిటీ డయాబెటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో మధుమేహంపై అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో, జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాలు జరిగాయి. డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ సి.పద్మావతిదేవిలు ఉచిత వైద్య శిబిరాల్లో మధుమేహం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. జిల్లా రిజిస్ట్రారు డి.శైలజ, సబ్ రిజిస్ట్రార్లు ఎం.విజయప్రసాద్, సి.హెచ్.రాంబాబు, సన్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు అజ్మత్, పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

పాత గుంటూరు: చుట్టుగుంటలోని కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మద్దు రామవృష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆర్యవైశ్య వృద్ధులకు, దివ్యాంగులకు రూ. 6 వేల చొప్పున 220 మందికి మూడు నెలల పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ కుటుంబసభ్యుల సహకారంతో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జీజీహెచ్‌లో ద్విచక్రవాహనాల చోరీకి యత్నం

వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన సిబ్బంది, రోగుల బంధువులు

పట్నంబజారు: గుంటూరు జీజీహెచ్‌లో ద్విచక్ర వాహనాల చోరీకి యత్నించిన వ్యక్తిని రోగుల బంధువులు, జీజీహెచ్ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం ప్రాంతానికి చెందిన పులి రమేష్ జీజీహెచ్‌లో ద్విచక్రవాహనాలు చోరీకి మంగళవారం యత్నించాడు. గమనించిన జీజీహెచ్ సిబ్బంది, రోగుల బంధువులు అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రమేష్‌పై గతంలో పలు చోరీ కేసులు, ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. గత మూడు రోజుల క్రితం సబ్ జైలు నుండి విడుదలై వచ్చినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

గుంటూరు ఈస్ట్: షాపులో చోరీ చేసిన నిందితుడిని అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భారత్‌పేట 3వలైనులోని సరయు బుక్‌స్టాల్‌లో ఈనెల 9న చోరీ జరిగిన ఘటన విధితమే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు పలు ఆధారాలు సేకరించిన పోలీసులు ఎం.సందీప్‌ను మంగళవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 2వేలు స్వాధీనం చేసుకున్నారు.

నగదు చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కారు అద్దాలు పగులగొట్టి నగదు చోరీ చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టాభిపురం మెయిన్‌రోడ్డులోని కాంచన టవర్స్ ముందు సోమవారం నిలిచి ఉంచిన కారును గుర్తుతెలియని వ్యక్తి అద్దాలు పగులగొట్టి కారులోని రూ.వెయ్యి చోరీ చేశాడు. మంగళవారం పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారుల నడుమ చిల్డ్రన్స్ డే వేడుకలు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జేసీ రాజకుమారి, రాధికారెడ్డి

గుంటూరు మెడికల్: పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని, వారితో ఎక్కువ సమయం గడిపితే వారిలో శారీరక, మానసిక ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తొలుత జీజీహెచ్ క్యాజువాల్టీలో నూతనంగా నిర్మించిన ఈసీజీ, కాలిన గాయాల వారికి చికిత్స అందించే రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ పిల్లల్లో చాలా జిజ్ఞాస, ఆసక్తి ఉంటుందని, ఏదో రంగంలో రాణించాలని అనుకుంటారని, వారిలో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి మాట్లాడుతూ నేడు స్మార్ట్ ఫోన్ల వల్ల పిల్లల్లో మెదడు ఎదుగుదల మందగిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్ని స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, మంచి విలువలతో పిల్లల్ని పెంచాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, మానసిక వ్యాధుల వైద్య విభాగం డాక్టర్ నీలి ఉమాజ్యోతి, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశశ్వి రమణ, పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ దేవకుమార్, డాక్టర్ రమేష్, తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా పిల్లలతో కేక్ కట్ చేయించారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

నెహ్రూనగర్: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని 21వ డివిజన్ కార్పొరేటర్ కే.గురవయ్య పేర్కొన్నారు. చిల్డ్రన్స్ డే ను పురస్కరించుకొని కృష్ణబాబు కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం – బాలల హక్కులు రక్షిద్దాం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బాలల హక్కులు, స్వేచ్ఛ, విద్యను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు.

శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు దేశ భవిష్యత్తు రథ సారథులని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీపురంలోని పాఠశాలలో ప్రీ–ప్రైమరీ చిన్నారులకు విచిత్ర వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సత్ప్రవర్తన పెంచడం ద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని అన్నారు. అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితే దేశాన్ని అభివృద్ధి బాటలో నడుపగలుగుతారని అన్నారు. ఈసందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది పలు సాంస్కృతిక, నృత్య, నాటక ప్రదర్శనలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి బాలలు భవిష్యత్తు సారథులు

గుంటూరు ఎడ్యుకేషన్: నేటి బాలలు భవిష్యత్తు దేశ రథ సారథులని కెనడీస్ నెక్ట్స్‌జెన్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య పేర్కొన్నారు. అరండల్‌పేటలోని నెక్ట్స్ జెన్ కిడ్స్ పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిందన్నారు. పాఠశాల ఇన్‌చార్జి వసంత లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యతోపాటు, క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులందరూ స్నేహభావంతో మెలుగుతూ క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి మంచి పౌరులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అదే విధంగా రాజేంద్రనగర్‌లోని కెనడీ నెక్ట్స్‌జెన్ కిడ్స్ క్యాంపస్‌లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్ బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో..

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సైకియాట్రిస్ట్ అజయ్‌కుమార్, దంత వైద్య నిపుణురాలు కె. శ్రీవిద్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని తెలిపారు. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్.ఆరోన్‌రెడ్డి, ఎస్.విజయభాస్కర్ రెడ్డి, ఎస్.జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలోత్సవం ..

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీఓ కాలనీలోని సుమేధ హైస్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా బాలోత్సవ్–6 ఉత్సాహంగా జరిగింది. ఈసందర్భంగా నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఫ్యాషన్ షో, విచిత్ర వస్త్రధారణ, డ్యాన్స్‌లో హుషారెత్తించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారులతో పాటిబండ్ల విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కెనడీ నెక్ట్‌జెన్ డైరెక్టర్ శ్రీవిద్య, ఇన్‌చార్జ్ వసంత లక్ష్మి



ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ఆరోగ్యవంతమైన జీవనశైలితో మధుమేహం దూరం

డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు



ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, పక్కన వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవటం ద్వారా మధుమేహాన్ని దరిచేరనీయకుండా కాపాడుకోవచ్చని గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. మంగళవారం ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా ల్యాబ్, ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ర్యాలీ జరిగింది. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీ ప్రారంభించారు. డాక్టర్ శ్రావణ కుమార్ మాట్లాడుతూ భారత దేశంలో కోట్లాదిమంది మధుమేహంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు లేకపోవడం, ఒత్తిడితో కుంగిపోవడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాలతో పాటు, వంశపారం పర్యంగా మధుమేహం వస్తుందన్నారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించడం ద్వారా మధుమేహం బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని అసోసియేషన్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో నేషనల్ ఎక్సరే కృష్ణ, గ్లోబల్ ల్యాబ్ లక్ష్మణ్, అయూబ్ ఖాన్, బాబ్జి, రమణ, ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం..

గుంటూరు మెడికల్: భారత దేశంలో సుమారు పది కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారని, బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ మధుమేహంపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. వరల్డ్ డయాబెటీస్ డే సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో డయాబెటీస్ వాక్, మధుమేహంపై అవగాహన సదస్సు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగింది. సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ జీవన శైలిని మార్చుకోవడం ద్వారా షుగర్ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చన్నారు. బరువు నియంత్రణలో పెట్టుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఎక్కువ సమయం నవ్వుతూ గడపడం ద్వారా ఒత్తిడికి దూరంగా ఉండి మధుమేహం దరిచేరదన్నారు. డాక్టర్ వి.కమల, డాక్టర్ సుజాత, డాక్టర్ శైలజ, డాక్టర్ శిరీష, డాక్టర్ గాజుల రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల కంటే గొప్పవి గ్రంథాలయాలు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: విజ్ఞానాన్ని అభివృద్ధి పర్చే గ్రంథాలయాలు దేవాలయాల కంటే గొప్పవని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో గ్రంథాలయాల్లో చదువుకుని ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. గుడి, మసీదు, చర్చి కంటే గ్రంథాలయం ఎంతో గొప్పదని, గ్రంథాలయాల్లోని విలువైన పుస్తకాలను అభ్యసించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, టీజీపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, గ్రంథాలయాధికారి ఎన్. వెంకటేశ్వరరావు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. ఎస్వీఎన్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో రికార్డు అసిస్టెంట్ బి. వెంకాయమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుతో మధుమేహం నియంత్రణ

గుంటూరు ఎడ్యుకేషన్: జీవనశైలిలో మార్పులతో మధుమేహ వ్యాధి నియంత్రణ సాధ్యపడుతుందని తులసి హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ టి. ఉమా శంకర్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ మధుమేహ నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉమాశంకర్ మధుమేహ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సా విధానం, ఔషధాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమతుల్య ఆహారం, జీవన శైలిలో మార్పులు, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహా మేరకు మందులను వాడటం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.

డిసెంబర్ 10న లలిత కళా ఉత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో డిసెంబర్ 10న లలిత కళా ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఎస్. మంగాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లలిత కళలను ప్రోత్సహించేందుకు బాల కుటీర్‌లో గత 28 ఏళ్లుగా నిర్వహిస్తున్న లలిత కళా ఉత్సవంలో భాగంగా లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు ప్రతిభా పల్లవ పురస్కారం, బాల సాహితీ సృజనకర్తలకు మంగాదేవి బాల సాహిత్య పురస్కారం, సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న మహిళలను మాలతీ ప్రమదా సాహితీ పురస్కారంతో సత్కరిస్తున్నట్లు వివరించారు. బాలల్లో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయిలో సంగీత, చిత్రలేఖన, కథారచనలో పోటీలను సైతం నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈనెల 25, డిసెంబర్ 10న జరిగే ఆయా పోటీల వివరాలను శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ నుంచి పొందాలని, వివరాలకు 0863–2232405, 9390115480, 7729967589, 8121590409 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

నెహ్రూ నగర్: అసమానతలు లేని భారతదేశాన్ని స్థాపించాలంటే అన్నివర్గాలు ఐక్యంగా కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ పిలుపునిచ్చారు. ఐక్యత విజయపథం పాదయాత్ర మంగళవారం లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఏసీ కాలేజ్ వరకు నిర్వహించారు. అనంతరం ఏసీ కాలేజీ ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశం మాట్లాడుతూ దేశంలో దోపిడీ, కుట్రలు కొనసాగుతున్నాయన్నారు. మణిపూర్‌లో కర్కశంగా మహిళలను చంపడంతో పాటు వివస్త్రలను చేసి ఊరేగించడం సిగ్గుచేటన్నారు. మనిషిని హింసిస్తూ, గోవులను కాపాడాలని దాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. హ్యూమన్ డెవలప్మెంట్ ఇండెక్స్ 150 దేశాల్లో మానవ హక్కుల పరిరక్షణపై సర్వే చేస్తే భారత్ 132 స్థానంలో ఉందంటే దేశంలో మానవ, పౌర హక్కుల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. దేశంలో ఆత్మరక్షణలో పడిన మైనార్టీ, క్రైస్తవులు ఓబీసీ, ఎస్సీ ఎస్టీలతో కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. తడ నుంచి ప్రారంభమైన ఐక్యత విజయ పథం యాత్రకు అన్ని వర్గాల వారి నుంచి విశేష స్పందన లభిస్తుందని, ఆయా వర్గాలను రాజకీయంగా చైతన్యం చేసేందుకే ఈ యాత్రను చేపట్టినట్లు వివరించారు. ఈ సమావేశంలో దళిత, బీసీ సంఘాల నాయకులు మల్లెల వెంకటరావు, కేసన్న శంకరరావు, విద్యాసాగర్, బెంజిమెన్, డేవిడ్ విలియమ్స్, స్టాలిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని హాజరుపై హర్షం

నెహ్రూ నగర్: ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవ్వడం హర్షించదగ్గ విషయమని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు పేర్కొన్నారు. మంగళవారం గోరంట్లలోని రోడ్ లోని సంఘ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ విశ్వరూపం మహాసభకు ప్రధాని హాజరవటం ద్వారా శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ సంబంధించిన బిల్లుకు ఆమోదం తెలుపుతారని విశ్వసిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు సుబ్బయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు



ఎమ్మెల్యే గిరిధర్‌రావును సత్కరిస్తున్న జనార్ధన్‌రెడ్డి, సుశీల, కార్పొరేటర్ వెంకట్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు అన్నారు. మంగళవారం ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్‌రావు మాట్లాడుతూ పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి చదువేనని గట్టిగా నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని చెప్పారు. ప్రపంచ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు వెళ్తున్న ప్రభుత్వం, పటిష్టమైన విద్యకు పెద్ద పీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఇంగ్లిషు మీడియంలో బోధన తెచ్చామన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పర్చడం ద్వారా రెండు వ్యవస్థల మధ్య స్నేహపూర్వ పోటీ కొనసాగి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జగనన్న అమ్మఒడి, విద్యా, వసతి దీవెన కార్యక్రమాల్లో అవినీతి, వివక్షకు తావులేని విధంగా నేరుగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం ద్వారా ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి తల్లులు తమ పిల్లలను బడికి పంపించేందుకే అమ్మఒడి పథకమని తెలిపారు. వచ్చే తరం మనకంటే బాగుండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. మన పిల్లలు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యతను పెంచారని తెలిపారు. అంగన్ వాడీల నుంచి కాలేజీల వరకు ఎన్నో సంస్కరణలు ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈసందర్భంగా బాలబాలికలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకట్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ జి.జనార్ధన్ రెడ్డి, హెచ్‌ఎం సుశీల, నాయకులు శివారెడ్డి, శారదలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

విజ్ఞాన్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం



చాచా నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సీతామహాలక్ష్మి, లావు రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు మోదేపల్లి సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా తొలుత డాక్టర్ సీతామహాలక్ష్మి, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యలు భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. సీతామహాలక్ష్మి మాట్లాడుతూ జీవితంలో ఆటంకాలు, అపజయాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా వాటిని సవాళ్ళుగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా, సామాజిక దృక్పథంతో అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. విజ్ఞాన్ స్కూల్స్ జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి

లక్ష్మీపురం: స్వాతంత్ర్యనంతరం తొలి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మన దేశ ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థలకు గట్టి పునాదులు వేశారని సీనియర్ ఇంజనీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెహ్రూ చేసిన ప్లానింగ్ కమిషన్ ఏర్పాటు మన సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడిందన్నారు. విద్యావేత్త ఆర్.వి సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులని, ఆధునిక దేవాలయాలని, అభివృద్ధి వాహకాలని నెహ్రూ నమ్మిన మార్గం సరైందని రుజువైందని గుర్తు చేశారు. అనంతరం సంస్థ సభ్యులు నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు.

పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషి

ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అప్పిరెడ్డి, పార్టీ నేతలు

పట్నంబజారు: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు ఏ సమస్య లేకుండా సమసమానత్వ భావనతో, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని శాసనమండలి ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో జరగనున్న 'జగనన్న ప్రగతి పథం' ర్యాలీ పోస్టర్‌ను బృందావన్ గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ చిత్తశుద్ధితో పూనుకున్నారని, పెత్తందారులపై ఒంటరి పోరుకు సన్నద్ధమయ్యారన్నారు. ఈ నెల 18వ తేదీ జరగనున్న జగనన్న ప్రగతి పథం ర్యాలీ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని, కార్యక్రమాన్ని ప్రజలందరి భాగస్వామ్యంతో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గుంటూరు జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు మాదాసు కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు సింగు నరసింహారావు, ఐటీ వింగ్ కమిటీ సభ్యులు దాసరి శ్రీకాంత్ యాదవ్, షేక్ అబ్దుల్ సలాం, డాక్టర్ నీలం సతీష్ కుమార్, మద్దు ప్రవచనబాబు, పార్టీ నాయకులు మాదాసు భాగ్యారావు, తాడేపల్లి విజయకృష్ణ పాల్గొన్నారు.